# నిర్వాసితుడు

పరశురామయ్యకు ఆ రోజు పోస్టులో ఒక ఉత్తరం వచ్చింది. 'నాకెవరు ఉత్తరం రాస్తారు?' అనుకున్నాడు, చేతిలోకి తీసుకుంటూ.

అతడికి చదవటంరాదు. ఊళ్లోకివెళ్ళి ఎవరిచేతనయినా చదివించుకోవాలి. గబగబా చెప్పులువేసుకుని బయలుదేరబోతున్నాడు.

"ఎక్కడికి బయలుదేరావు ఈవేళప్పుడు? చిన్నోడు పొలంలో ఉన్నాడు" భార్య ఎదురుగావచ్చింది.

ఆమె ఎండిన పిడకలను గంపలకెత్తి చేతులుదులుపుకుంటూ "చేతిలో ఆ కాగితమేంటి?" దగ్గరగా వచ్చింది.

"ఉత్తరం వచ్చింది. ఎవరురాశారో సంగతేమిటో కనుక్కొస్తా. అట్లా బజారుకెళ్తే ఎవరయినా చదివి చెప్తారు.''

"ఎండపడింది. మజ్జిగచుక్క తాగిపో'' గ్లాసులో తెచ్చియిచ్చింది. రాములమ్మ.

"నీకు చదువురాదాయె. నాకు అక్షరమ్ముక్కా తెలియదు. చదివించుకోనొచ్చిచెప్పు. చిన్నోడు చీకటిపడితేగాని రాడు." గ్లాసందుకుంది రాములమ్మ.

"ఇది విడ్డూరంగాలేదూ? ఇంతకాలమైంది మనకెప్పుడన్నా ఉత్తరం వచ్చిందా?" పరశురామయ్య పరవశం ఇంకా తగ్గలేదు.

''తొందరగావెళ్లి చదివించుకురా అయితే?" అతడు వెళ్ళగచూసి వాకిటి గడపదగ్గరే కూర్చుంది రాములమ్మ.

పరశురామయ్య కోమటికొట్లో చదువొచ్చిన పిల్లవాడికి ఆ ఉత్తరమిచ్చి చదవమన్నాడు.

"నాకు గిరాకీవేళ. వీళ్ళను పంపించి చదువుతా. అట్లాకూచో బాబాయి" అన్నాడు కోటి.

అరగంట ఆగేటప్పటికి ఎన్నో గంటలనిపించింది పరశురామయ్యకు.

కోటి పనిపూర్తిచేసుకుని ఉత్తరమందుకుని చదవటం మొదలుపెట్టాడు.

నాయనకు,

నమస్కరించి రాయునది. నేను మనఊరు వదలిపెట్టివచ్చి పాతికేళ్ళయింది. పట్నంవచ్చి, తిరిగి తిరిగి ఒక నౌకరీ సంపాదించుకున్నాను. వారానికి పదిరూపాయలు. రెండుపూటలు భోజనం. మధ్యాహ్నంకప్పు టీ ఇస్తారు. ఇక్కడే ఒక పిల్లనుచూసి పెళ్ళిచేసుకున్నాను. నలుగురు పిల్లలు. ముగ్గురాడపిల్లలు. నా భార్యకు కూడా నేనుచేసే చోటనే నౌకరీ దొరికింది. పిల్లలు చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఇక్కడ పిల్లలతో ఉండటానికి తావే సరిగలేదు. నేను తిరిగి ఇంటికి వస్తున్నాను.

ఇట్లు
మీ కుమారుడు
వెంకన్న.

''వెంకన్న ఏంచదువుకున్నాడు ?" అడిగాడు కోటి. అతడికి జవాబివ్వకుండానే పరశురామయ్య గబగబా అడుగులు వేసుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. అతడిని అంతదూరాన చూడగానే ఎదురుగా వచ్చింది రాములమ్మ.

"వెంకన్న రాశాడు. పెళ్ళి చేసుకున్నాడట. నలుగురు పిల్లలట. వస్తున్నానని రాశాడు."

"వెంకన్న వస్తున్నాడా ?'' ఆ సంబరంలో ముఖం చేటంతయింది రాములమ్మకూ. పరశురామయ్యకూ కాళ్ళు నేలమీద ఆనటంలేదు.

"ఎన్నేళ్ళయిందో వాణ్ణిచూసి ?'' రాములమ్మకు ఆనంద భాష్పాలు కళ్ళల్లో నిలిచాయి.

"పాతికేళ్ళు కాలేదూ ? అయింది. మనమీద అలిగి వెళ్లినవాడు వారానికి తిరిగొస్తాడనుకున్నాను. పాతికేళ్ళయింది." కళ్ళు తుడుచుకున్నాడు.

ఆ రాత్రి ఆరుబయట ఈతాకులచాప పరుచుకుని పడుకున్నారు వెంకన్న సంగతులే చెప్పుకుంటూ ఆ యిద్దరూ.

ఆ యిద్దరి సంతోషంలో ఒక విషాదరేఖ-కంఠంలో ఒకజీర తొంగి చూసింది. ఒక నిట్టూర్పుతో ఇద్దరికళ్ళూ మూతలుపడ్డాయి రాత్రి పదిగంటల వేళకు.

రాములమ్మ కొడుకులలో చిన్నవాడు భూమన్న. వెంకన్నకూ భూమన్నకూ మధ్య రెండేళ్ళుతేడా. వెంకన్న నిద్రలేవగానే ముఖం కడిగి చద్దన్నం తిని ఇంట్లోనుంచి వెళ్ళేవాడు. మధ్యాహ్నం-వేళగానివేళ వచ్చి, అందరిమీద అరుస్తూ తనే అన్నం పెట్టుకుతినేవాడు. తల్లి పెరట్లోనుంచి వచ్చేసరికి ఇంట్లోనుంచి బయట అడుగు పెట్టేవాడు. రాత్రి చీకట్లో ఎప్పుడోవచ్చి పడుకునేవాడు. తండ్రి పొలం పోదాం ఉండమంటే మాటవినుపించుకునేవాడు కాదు ఊళ్లో తగాదాలు పుట్టించేవాడు.

భూమన్న ఇందుకు విరుద్ధంగా ఉండేవాడు. వెంకన్నకంటె పొడుగ్గా ఉంటాడు. పెద్దపెద్దకళ్ళు-మెరుగు చామనచాయలో ఆకర్షణీయంగా ఉంటాడు.

తండ్రి ఎడ్లను పొలానికి తోలుకుపోతే ఇంట్లో తల్లికి పనుల్లో ఆసరాగా ఉండి, మధ్యాహ్నానికల్లా తండ్రికి అన్నంమూట తీసుకువెళ్ళి అక్కడే ఉండేవాడు. చిన్నప్పుడే అరకదున్నటం నేర్చుకున్నాడు. తల్లితో కలిసి నాట్లువేసేవాడు. కలుపు తీసేవాడు. పొలాలకు పంట కాలవలోనుంచి తండ్రితో పాటు నీళ్లు ఎత్తి పోసేవాడు. కోతల్లో తల్లితోనే ఉండేవాడు.

"ఆరీ, నీవుండరా ! అన్నిటిలో జొరబడతావు ?'' తండ్రి మందలించేవాడు. ''నీవుండమ్మా. నేను చేస్తాను'' తల్లి చేతిలోనుంచి పారలాక్కునేవాడు భూమన్న.

"నీవుండరా చిన్నవాడివి" అని అంటే "నేనెప్పుడు నేర్చుకునేది ?" అనేవాడు తల్లితో.

భూమన్న ఇలా తలిదండ్రులతో పనిచేస్తూ పొలంపనులన్నీ నిర్వహించటం మొదలుపెట్టాడు. పద్దెనిమిదేళ్ళు వచ్చేసరికి తండ్రి ప్రమేయం లేకుండానే వ్యవసాయం చేయటం మొదలుపెట్టాడు.

"వీడికి పెళ్ళిచెయ్యాలి. ఏమంటావు ? మనవాళ్ళకెవరికయినా చెప్పు. వెంకన్న పెళ్ళి మనం చెయ్యనేలేదు. వీడికయినా చేద్దాం'' తల్లి పోరుపెట్టేది.

"నీ తమ్ముడికి చెప్పిపంపు. పిల్లను చూస్తాడు."

ఇలా అనుకుంటూ ఉండగానే పరశురామయ్యకు ఒకకాలూ చెయ్యీ పడిపోయింది. ఆ ఏడే రాములమ్మ తమ్ముడిని పిలిపించి ఇంటి వ్యవహారాలన్నీ చెప్పింది. అతడు ఒక మంచికుటుంబంలో నుంచి పిల్లను తీసుకువచ్చి పెళ్ళి చేశాడు.

ఆ మరునాటినుంచీ సుబ్బు ఇంటిపనంతా అనుభవంగల దానిలా చేయటం మొదలుపెట్టింది. తెల్లవారకముందే పెరట్లో పొయ్యిపెట్టి అన్నం వండేది. పప్పుచారు చేసేది. రాములమ్మను పనిచేయనిచ్చేది కాదు. ఆమె భూమన్నను ఏడు గంటలకే పొలానికి పంపించేది. పని లేనినాడు భూమన్నచేత మట్టి తవ్వించి ఇల్లంతా రోజుకింత వంతునమెత్తి పూతపూసేది. ఇంట్లో బూజులన్నీ దులిపేది. ఊడ్చి అలికి ముగ్గులు పెట్టేది.

సాయంత్రపు వేళ పరశురామయ్య కూర్చోటానికి రాళ్ళతో అరుగు కట్టి మట్టితోమెత్తి, నున్నగాచేసి పేడతో అలికి సిద్ధంచేసింది.

పరశురామయ్య కోడలు చేసేపనులు చూసి మురిసి పోయేవాడు. రాములమ్మకు తీరిక ఎక్కువయింది కనుక ఇద్దరూ కబుర్లు చెప్పుకునేవారు. ఒకోరోజు అక్కడే భోజనాలు చేసేవారు

పనంతాచేసి భూమన్నకూ తనకూ భోజనం గిన్నెలోపెట్టుకుని పొలానికి పోయేది సుబ్బు. అన్నం తిన్నతరువాత యువజంట చెట్లకింద పడుకుని విశ్రాంతి తీసుకునేది. ఇద్దరూకలిసి పొలంపనులు చేసుకుని పొద్దుగూకకముందే ఇంటికి చేరుకునేవారు-ఊసులాడుకుంటూ.

ఇంటికిరాగానే సుబ్బు వేడినీళ్ళు కాగపెట్టి భూమన్నకు స్నానానికి నీళ్ళిచ్చేది నూకలుంటే నూకలు, లేకపోతే బియ్యం పొయ్యిమీదికెక్కించేది.

సుబ్బు వచ్చిన తరువాత పంటచేలలో గోంగూర దోసకాయ వంటివి

వండించేది. ఇంటికి వచ్చేటప్పుడు అల్లం వెల్లిగడ్డ చింతపండు తెచ్చి పరశు రామయ్యకు ఇష్టమని కారప్పొడికొట్టి వడ్డించేది.

పరశురామయ్యకు జిహ్వకింపైన ఆహారం మూడుపూటలూ అందించేది. రాములమ్మ మునపటి వలెకాక నునుపు తేలింది.

ఒకనాడు "ఏం భూమన్న బావా! మనకు మరీ ఒక్కగదయిపోయింది. ఈ పక్కకు మనమొక గది వేసుకుందామా?" మధ్యాహ్నం అన్నంతిని చెట్టుకింద విశ్రాంతి తీసుకునేవేళ అడిగింది సుబ్బి.

"ఏంపెట్టి కడతావు? అన్నాడు ఎగతాళిగా.

"నీవిన్ని వెదుళ్ల తీసుకురా. మట్టితో గదివేసుకుందాం"

ఉన్నగది ఏనాటిదో పెద్దలు కట్టింది. దానిముందర చిన్నపందిరివేసి ఆకులతో కప్పారు. పరశురామయ్య ఇల్లు కొంచెంపెద్దది చెయ్యాలన్న ఆలోచన లేకుండానే కాలం గడిపేశాడు. భూమన్న పుట్టినప్పటినుంచీ ఆ ఊసేలేదుఇంట్లో. అందుకే "చూద్దాంలే'' అన్నాడు.

కాని-సుబ్బి నిలవనివ్వలేదు. గడలతో ముందు ఆకారం తయారుచేసి మట్టిముద్దలతో మెత్తింది. ఎర్రమట్టితో పూతలుపూసింది. పైన కర్రలతో కప్పు తయారుచేసి తాటాకుల కప్పించింది భూమన్నచేత.

గది తయారయిన నాడు బెల్లంతో పొంగలిచేసి ముందు అత్తకూ మామకూ పెట్టింది.

"చూడు. మన సుబ్బి ఎంతపనిచేసిందో? ఇల్లాలంటే ఇట్లా ఉండాలి'' పరశురామయ్య తన భార్యతోనే కాదు-అందరితో చెప్తాడీమాట.

ఆ సంవత్సరం వడ్లు మునపటికంటె బాగాపండాయి. భూమన్న సుబ్బి ఆరుబస్తాల వడ్లు పాతరవేశారు ఇంటిముందర.

సుబ్బి భూమన్నా కలుపు తీయటం దగ్గర్నుంచి కూలీలను పెట్టకుండా కోతలు కుప్పలుకూర్చటం. వడ్లు ఇంటికి తీసుకురావటం-ఆరపోయటం స్వయంగా చేసుకున్నారు.

ఆరబోసిన వడ్లు సుబ్బి దంచింది. రాములమ్మ చెరిగింది. గడ్డిమోపులు కట్టి ఇంటికి తీసుకువచ్చాడు భూమన్న.

పరశురామయ్యకు ఎడ్లజత ఉంది కాని-ముసలివయ్యాయి. చురుకుగా పని చేయలేకుండా ఉన్నాయి. పని సరిగా సాగటంలేదు. వీటినమ్మి కొత్త ఎడ్లజత కొనాలనుకున్నాడు భూమన్న. పొలానికి ఎరువులు తోలేటప్పుడు అతడి కని పించింది-తనతండ్రీ తల్లీ పెద్దవాళ్ళయినట్లే ఆ ఎడ్లజత కూడా ముసలి వయ్యా యని.

ఆమాటే తండ్రితో అంటే "మనమేం కొనగలంరా?" అన్నాడు. తల్లితో అంటే ఆమె తనచేతికున్న వెండిదండ కడియం తీసిచ్చింది. సుబ్బు తన మెడ లోని బంగారు గుండ్లు తీసిచ్చింది.

భూమన్న ఆ మరునాడే కొత్తగిత్తలను కొన్నాడు. ఆ సంవత్సరం సుబ్బు సహాయంతో రెండుపంటలు తీయగలిగాడు. ఒకపంట వడ్లతో తల్లికి చేతికడియం చేయించి ఇచ్చాడు. రెండోపంట వడ్లు పాతర్లో పోశాడు. వర్షంలేని కాలంలో మెట్ట పంట పండిస్తున్నాడు. వర్షాకాలంలో వరి పండిస్తున్నాడు.

ఇలా ఆ పడుచుజంట నేలతల్లి అనుగ్రహంతో పంటలు పండిస్తున్నది. పట్నంపోయి అమ్ముకువస్తున్నారు. ఆ డబ్బులో చింతపండు మిరపకాయలు మొదలైన చిల్లరసామాను కొంటున్నారు.

రెండుమూడు సంవత్సరాలనుంచీ వర్షాలు అమితంగా కురుస్తున్నాయి. ఇల్లు కురవటం మొదలుపెట్టింది. తడిసిన నేలేగాని తడవని చోటులేదు ఇంట్లో.

సుబ్బు మనసులో ఆలోచనలు ఊటలూరుతూ ఉంటాయి. ఇద్దరు కూలీ లనుపెట్టి ఆ రెండు గదులనూ తాటిపట్టెలతో మిద్దెగదులుగా మార్పించింది. రెండుపంటల వడ్లు గాదెలో ఉన్నవి సగానికి పైగా ఖర్చయ్యాయి. అయినా మట్టసంగ రెండు మిద్దెగదులూ ముందువసారా అమరినందుకు ముసలిదంపతులు మురిసిపోయారు. మరో రెండేళ్ళకు గాదె నింపుకున్నారు.

పెద్దవాళ్లు ఒంటినిండా బట్టలూ, మారుబట్టలతో ఆనందపడ్డారు. కాలం హాయిగా గడిచిపోతున్నది వాళ్ళకు.

భూమన్న-సుబ్బులు బంగారు గుండ్లను మర్చిపోలేదు. ఆ యేడుచేయించి పెట్టాడు.

పడుచుదంపతులు మధ్యాహ్నం వేళ భోజనాలుచేసి చెట్లకింద గోనేపట్టా పరుచుకుని కబుర్లు చెప్పుకుంటూ "మావాళ్లింట్లో సొరపాదులూ గుమ్మడిపాదులు పెట్టి ఇంటిమీదికెక్కించేవాళ్ళు. పెరట్లో ఆకుకూరలు మళ్లు పెంచేవాళ్లు. నీవు పారతో మళ్ళు తయారుచెయ్యి. నేను గింజలుతెస్తాను" అనేది.

''నీ బుర్రలో ఎప్పుడు? పురుగుతొలుస్తూ ఉంటుందా? నీవొచ్చినాక నాకు ఊపిరి తీసుకోనుతీరిక లేకుండయింది''

"పోనీలే పెరడంతా బెడ్డలతో గతుకులతో గడ్డిమొక్కలతో అట్లనే ఉండనీ" మూతిముడిచింది.

''నేను నవ్వుతూ అంటే ఇంత మూతిముడుపా? "ఆమె కొప్పంతా ఊడదీశాడు.

బంతిపూలన్నీ నేలరాలాయి.

ఆ మరునాడు భూమన్న పెరడంతా తవ్వి రాళ్ళూరప్పలూ తీసి మళ్లు తయారుచేశాడు. తెల్లవారగానే విత్తనాలువేసింది సుబ్బు. ఇంటికి దగ్గరగా కుడిపక్క ఒకటి ఎడంపక్క ఒకటి పాదులు పెట్టింది ఇంటిముందర పందిరిమీదికి ఎక్కేటానికి వీలుగా సొరపాదు పెట్టింది.

వర్షాకాలం నీళ్లు పొయ్యకుండానే చెట్లు ఎదుగుతున్నాయి. తీగెలుసాగాయి. తాడుకట్టి పైకెక్కించింది. పిందెలు పడగానే అంబరాన్నందుకున్నంత సంతోషంగా ఉంది. సుబ్బుకు. భూమన్నకు గాంభీర్యం మెక్కువ. నోటిమాట తక్కువ. కాని సుబ్బునూ సుబ్బుపనులూ చూసి మనసులో ఉప్పొంగిపోతాడు. సుబ్బులు నోరు ఒక్కక్షణం ఊరుకోదు. ఏవో కూనిరాగాలు తీస్తుంది. పొలంపని చేసేటప్పుడు తీగెలుసాగే తీయటిగొంతుతో ఏవేవో పాటలు పాడుతూ ఉంటుంది ఆ కంఠ మాధుర్యానికి ఉప్పొంగుతూ మరింతజోరుగా పనిచేస్తాడు భూమన్న.

ఆకుకూర ఎదిగిన్నాడు కూరవండి ''అత్తమ్మ ఇది మనపెరట్లోది. మామయ్యా ఇది పెరట్లోది. తినిచూడండి'' అన్నది.

"నీవు సుబ్బువుకావే మాలక్ష్మివి" అన్నాడు పరశురామయ్య.

"నీవు వచ్చినాక వంట మరిచానే సుబ్బూ'' అన్నది రాములమ్మ.

''నీకేంపని నేనుండగ ?''

'ఎట్లైన భూమన్న అదృష్టవంతుడ'నుకున్నారు మురిసిపోతూ తల్లి దండ్రులు.

సొరకాయలు ఐదారు ఒక్కసారే పెద్దవయ్యాయి. గుమ్మడి పిందెలు ఎదుగుతున్నాయి. ఒక సొరకాయ ఇంట్లోపండింది. ఐదు సొరకాయలు ఊళ్ళో అమ్మి డబ్బులు చెంగుకుకట్టుకుంది. ఆకుకూరలు బాగా ఎదిగిననాడు చిన్న చిన్న కట్టలుకట్టి వాటినికూడా అమ్మేది. వీటి ఎదుగుదలను చూసి కర్వేపాకుమొక్కలు రెండు పెరట్లోనాటింది. కంపతెచ్చి చుట్టూనాటింది గొడ్లు మేయకుండా. వాకిట్లో ఒకపక్కగా ఎడ్లకు పాకఉంది. తెల్లవారగానే పాక బాగుచేసి పేడకుప్పచేసి ఉంచుతుంది. పొలానికి వెళ్ళనినాడు కొంతపేడ పిడకలుచేస్తుంది. మిగతాది గోతి లోకి తోస్తుంది. చెత్తచెదారం గొడ్లుతొక్కిన గడ్డి అంతా గోతిలోకే ఊడ్చేస్తుంది. వారానికొకసారి ఇల్లంతా ఎర్రమట్టితో అలికి ముగ్గువేస్తుంది.

అందరూ కడుపునిండా అన్నం తింటున్నారు. ఒంటినిండా బట్టకడు తున్నారు. ఇంటికి ఒక ఆకారంవచ్చింది. రెండు మిద్దెగదులూ వాటిముందర పందిరీ ఏర్పడ్డాయి. వాకిట్లోకి గొడ్లువచ్చి చెట్లు పాడుచెయ్యకుండా చుట్టూ కంచె వేశారు. వెదురుబద్దల గేటు పెట్టారు.

సూరయ్య, పరశురామయ్య స్నేహితుడు. ఒకరోజు చూడ్డానికివచ్చి ''ఇది నీ యిల్లేనా ? నేను గుర్తుపట్టలేదు సుమా'' అన్నాడు.

"ఏదో మనభూమన్న వాడిభార్య ఇల్లూ-ఇంటీపనీ పొలంపనీ చూస్తున్నారు. నన్ను చూస్తున్నావుగా ? మంచానపడ్డాను. కర్రఉన్నా ఒకరు నడిపించాలి."

"పెద్దకొడుకు వస్తాడని విన్నాను ?"

"అవును పెద్దోడు వెళ్ళి పాతికేళ్ళుదాటింది. ఇప్పుడు వస్తానంటున్నాడు."

"వాడిభాగం వాడికి పంచియిచ్చెయ్యి."

"నేనుండగానేనా ? ఇదంతా చిన్నోడు కట్టుకున్న ఇల్లు. పాతది పడి పోయింది."

"నామాట విను ఆ రెండు ఎకరాలలో ఒక ఎకరం పెద్దోడికి ఇచ్చెయ్యి. నీయింటి పక్క భూమికూడా ఇవ్వు. ఇల్లు కట్టుకుంటాడు"

"పాతికేళ్ళకిందట వెళ్ళిపోయినవాడు ఇప్పుడు వస్తానంటున్నాడు. నాకదే గొప్పగా ఉంది"

"ఉందనుకో. కాని వ్యవహారం వ్యవహారమే. అందులో వాడి మనసు మంచిదికాదు. వేరుగా ఉంచు"

"చూద్దాం"

"ఇల్లూ వాకిలీ బాగుచేసుకున్నారు. కష్టపడి పండిస్తున్నారు. ఇంట్లో గాదెలో వడ్లు-పాతరలో వడ్లు ఇదంతా చిన్నోడి నిర్వాకం. పెద్దవాడికి కన్నుకుట్టుగా ఉంటుంది."

"చిన్నోడికంటె ఆపిల్లదను. ఏదో పనిచేస్తునే ఉంటుంది. వాడిచేత చేయిస్తుంది. నీవన్నమాట ఆలోచించాల్సిందే"

వెంకన్న భార్యాపిల్లలతో వచ్చి ఇంటిముందర నిలబడి ఇటూఅటూ చూస్తున్నాడు లోపలికి పోవటానికి కర్రగేటు తాళ్ళతో కట్టిఉంది. అవునో కాదో అంటూ తాళ్ళువిప్పి లోపలికివచ్చి 'అమ్మా' కేకపెట్టాడు.

రాములమ్మ లోపలనుంచి వస్తూ ఎవరది అంటూ ఎదురుగా నిలబడి "వెంకన్నా. నీవేనా ? గుర్తుపట్టలేదురా" అంటూ "వాకిట్లో నిలబడ్డారెవరూ ?" అంది.

"కోడలమ్మా, పిల్లలుకూడా వచ్చారు. రండర్రా. ఇదేఇల్లు" కేకపెట్టాడు.

బిలబిల్లాడుతూ వచ్చారంతా. పెద్దకోడలు పరిశీలనగా ఇల్లూవాకిలీ చూస్తూ వస్తోంది.

"నాన్నేడి ?" వెంకన్న దృష్టి ఇంటి నాలుగుమూలలా ప్రసరించింది.

''అన్నంతిని అరుగుమీద పడుకున్నాడు. కాలూచెయ్యీ పడిపోయింది." కళ్ళు ఒత్తుకుంది.

''భూమన్న ?"

వాళ్ళిద్దరూ పొలానికెళ్ళారు. పొద్దుగూకకముందే వస్తారు."

మాటల సందడికి పరశురామయ్య లేచాడు.

''వెంకన్నా ఎన్నేళ్ళయిందిరాచూసి ? రా. ఇక్కడొచ్చి కూచో. నాసంగతి విన్నావా ? నడవలేను. నీళ్ళుపోసి, బట్టకట్టి, ఇంత అన్నం పెడితే తింటాను".

"ఊం. అంతాబాగానే ఉన్నారుగా !"

ఇంతలో పిల్లలు దొడ్డి వాకిలి అంతా తిరిగి సొరపిందెలు కోసుకొచ్చారు. "అమ్మా ఆకలే'' గోలచేయటం మొదలుపెట్టారు.

"అత్తమ్మా, అన్నం ఉందా ? పిల్లలకు పెడతాను."

''లోపల చూడమ్మా కుండలో కొంచెమయినా ఉంటుంది.''

''పళ్ళెంలో అన్నం కలిపిపెట్టింది- ''గోంగూర పప్పు. చాలా బాగుంది'' పిల్లలు ఉన్నది తుడుచుకుతిన్నారు.

కోడలు మంగమ్మ పెరడంతా కలియతిరిగింది. రెండు గదులున్నాయను కుంటూ తొంగిచూసింది.

బంగారు బిందెల్లా ఉన్న గుమ్మడికాయలూ నాలుగు, పొడుగాటి పెద్ద సొరకాయలు ఐదూ, ఆకుకూరల కట్టలూ అమ్మి, డబ్బులు బొంగుకు కట్టుకుని, నవ్వుకుంటూ నడుస్తోంది సుబ్బి.

''నువ్వెంచెప్తావా ? నేనే చెప్పనా ?'' అడుగుతూ మురిసిపోతూ నడుస్తు న్నాడు భూమన్న.

''నీవేచెప్పు ?''

"నీవంటే నీదను''కుంటూ అంగణంలో అడుగుపెట్టారు.

''ఇల్లంతా సందడిగా ఉంది. ఎవరొచ్చారు ?" భూమన్న పందిట్లోకి వచ్చి నిలబడ్డాడు.

"మనవెంకన్నరా. ఇన్నేళ్ళకు వచ్చాడు.'' పరశురామయ్య ఆనందం పట్ట లేకుండా ఉన్నాడు.

వెంకన్న క్రీగంట తమ్ముడినీ ఇంట్లోకి పోతున్న సుబ్బునూ చూశాడు. కన్ను చెదిరినట్లయింది.

సుబ్బు వాళ్ళనుచూసి కాళ్ళుకడుక్కుని పొయ్యి వెలిగించి నీళ్ళకుండ ఎక్కించింది. మరోపొయ్యిమీద బియ్యానికి ఎసరు పెట్టింది.

"అత్తమ్మా, ఒక్కసారొచ్చిపో" కేక పెట్టింది.

"అన్నంలోకి ఏంచెయ్యను ? చుట్టాలొచ్చినట్టున్నారుగా ?"

"చుట్టాలు కాదే, నీబావ వచ్చాడు పెళ్ళాం పిల్లలతో. కూరచెయ్యి."

గడపదగ్గరగా కూర్చున్న మంగమ్మ పరశురామయ్య వెంకన్నతో మాట్లాడే మాటలు వింటున్నది.

"వాళ్ళిద్దరూ బాగా కష్టపడుతున్నారు. పంటలు పండిస్తున్నారు, గాదెలో వడ్లున్నాయి, నాలుగైదు బస్తాలు పాతరేశారు. కొత్త గిత్తలు కొన్నారు. కోడలు మంచి పనిమంతురాలు. ఈ మిద్దె గదులు వాళ్ళే కట్టారు. వంటకు పంచదించా లంటోంది కోడలు. కూరలు పెరట్లో పండిస్తోంది."

వింటున్నాడు వెంకన్న. ఏదో బాధపడుతున్నట్టుగా ముఖం చిట్లించాడు.

''ఏం ? బాగున్నావా అన్నా'' స్నానంచేసి ఉతికినబట్ట కట్టుకుని వచ్చి అన్న పక్కన కూర్చున్నాడు భూమన్న.

"ఇదిగో ఇట్లా ఉన్నా, పిల్లలకూ దానికీ తిండిలేదు. ఒంటికి బట్టలు లేవు. ఉండటానికి చోటు లేదు. నీకేం ఇంటిపట్టున కడుపులో చల్లకదలకుండా ఉన్నావు. పెళ్ళయిందటగా ?" అన్నాడు.

ఆ మాటలు సంతోషంతో అన్నట్టుగా లేవు.

"నాయన లేవలేకుండా అయినాడు. అమ్మ ఇంట్లో నాయనదగ్గర ఉంటోంది. మేమిద్దరం పొలానికి పోతున్నాం. నాకు చేతనయినట్లు చేస్తున్నా"

"అంతేలే" అన్నాడు పొడిమాటలుగా.

సత్తుపళ్ళెం వెంకన్నకు పెట్టి అందరికీ విస్తళ్ళల్లో వడ్డించింది సుబ్బు- పుల్లకూర పప్పు చేసింది.

విస్తరినిండా అన్నం పప్పుచూసి పిల్లలూ తల్లీ అపురాపురుమంటూ తిన్నారు. వెంకన్న కడుపునిండా తిన్నాడు గాని కడుపులో ఏదో కుట్టుగాడుంది.

వారం గడిచేసరికి గాదెలో వడ్లయిపోయాయి, పాతర తీయవలసివచ్చింది. ఒకరోజు సుబ్బు ఇంట్లోఉండి వడ్లు దంపింది వారానికి సరిపడా. ఎక్కడి కూరలూ చాలటంలేదు. వారానికనుకున్న వడ్లు నాలుగు రోజులకే నిండుకు న్నాయి.

ఆకుకూరల మడులన్నీ పిల్లలు తొక్కేశారు. ఇటు చెంబుతీసి అటుపెట్టే వారు లేరు. ఇంటా బయటా పనిచేసి అలిసిపోతోంది సుబ్బు.

''విన్నావా ? సుబ్బుకు నాలుగోనెల. నీకు మనమడో మనమరాలో పుట్ట బోతున్నారు" మురిపెంగా అంది రాములమ్మ పరశురామయ్యతో.

"అట్లాగా ! మంచి కబురు చెవినవేశావు. నోట్లో బెల్లంముక్క పెట్టు'' అన్నాడు సంబరంగా.

ఆ మాటలు విన్న వెంకన్న ''ఇంకేం ? ఇల్లుచాలకుండా పుట్టుకొస్తారు పిల్లలు" అన్నాడు సహించలేక.

"ఇది మొదటికానుపు కదా ? వాడి కడుపున నలుగురిని పుట్టనీ. కానే పయినా కూచోదు, ఏదోపని చేస్తునే ఉంటుంది" సుబ్బు.

ఆ రాత్రినుంచీ మంగమ్మ వెంకన్నతో మంతనాలాడటం మొదలుపెట్టింది.

"చూడు, ఈ కుండలనిండా పప్పులూ, చింతపండూ, మిరపకాయలూ ఉన్నాయి, కావలసినంత ధాన్యం ఉంది. నీ తమ్ముడొక్కడే అనుభవిస్తున్నాడు. నీవూ ఉన్నావు కబుర్లకు" అంది మంగమ్మ మంటఎగసన తోసినట్టుగా.

ఆ రాత్రి వెంకన్న కడుపు మసిలిపోయింది. తెల్లవారగానే తండ్రి దగ్గర చేరాడు. అప్పటికే ఇంటిపనులన్నీ చేసి తమకిద్దరికీ భోజనం కట్టుకుని సుబ్బు, భూమన్నా పొలానికి వెళ్ళిపోయారు.

"నాయన, నేను నిన్న ఊళ్లోకిపోయి అంత విచారించివచ్చా. మన భూమన్న పొలంలోనే వడ్లబస్తా లమ్ముతున్నాడట. ఇంటికి తెచ్చేవి అందులో సగమట. వాడి

వెంట వెంట తిరుగుతూ ఆ పిల్ల ఈ డబ్బంతా పుట్టింటికి చేరవేస్తున్నదట. ఇట్లాంటి పనులు ఎట్లా సహిస్తున్నావు ?"

కడుపుమంటను వెలిగక్కాడు వెంకన్న.

"ఛీ ఛీ, ఎవరురా ఈ మాటలు నీకు చెప్పింది? నాకు చేతకాక వదిలిపెట్టిన పొలాన్ని వాళ్ళు సాగుబడి చేస్తున్నారు. ఇన్ని వడ్లను ఎప్పుడైన కళ్ళతోచూశామా? నిత్య దారిద్ర్యంతో మునిగిపోయిన మన కుటుంబాన్ని అన్ని విధాలా ఆ పిల్ల తోడుతో ముందుకు తెస్తున్నాడు. ఇల్లెట్లా ఉందో చూశావా ? ధాన్యలక్ష్మితో నిండి కళకళలాడుతూ ఉంది. ఇద్దరూ రెండు గదులూ ముందర పందిరీవేశారు, చుట్టూ కంచె.''

''ఆఁ, అట్లా నిన్ను మురిపించి టోపీ పెడుతున్నారు. నీవు తెలుసుకో లేకుండా ఉన్నావు. నామాట విను, నేను ఇంట్లో ఉండటానికే వచ్చా. నా పెళ్లాం పిల్లలు ఎక్కడుండాలో ఏంతినాలో చెప్పు ?"

"ఇంట్లో ఉండు, పొలంపనులు మీరూ చెయ్యండి. చెరిసగం తీసుకోండి. నీకు కావలసినన్ని గదులు వేసుకో."

"అట్లా కుదరదు. ఈ పాతికేళ్ళనుంచీ వాడొక్క డే ఉండి అంతా అనుభ విస్తున్నాడు. నేను చిల్లిగవ్వ ఎరగను. వాణ్ణే ఎక్కడయినా ఉండమను. పొలంలో అడుగు పెట్టటానికి వీలులేదు. తెల్లవారిన తరువాత వాడు నా కంటబడితే నేనేం చేస్తానో ?" నిప్పులు కురిపించాడు వెంకన్న.

అంతలో భూమన్న సుబ్బు లోపలికి వచ్చారు. ఈ మాటలు వాళ్ళ చెవిన పడ్డాయి. అలిసిపోయి వచ్చిన ఇద్దరూ లోపలికివెళ్ళి కాళ్ళు కడుక్కొని వచ్చారు.

సుబ్బు వంటచేసింది. అందరూ భోజనాలు చేశారు.

భూమన్న తండ్రిదగ్గర చేరి" ఏమిటా కేకలు ?" అడిగాడు.

పరశురామయ్యకు చెప్పక తప్పింది కాదు.

"పంచాయితీ పెట్టిస్తా. నీది నీకిప్పిస్తా. నీయిల్లు నీభూమి ఎక్కడికీ పోదు. భయపడకు" తండ్రి అభయమిచ్చాడు.

''నేను తెల్లవారి కనబడకూడదంటున్నాడు. సుబ్బు కడుపుతో ఉంది.

డాక్టరమ్మకు చూపించి తీసుకువచ్చా. దానికడుపులో ఇద్దరున్నారట, జాగ్రత్తగా చూసుకోమన్నది. ఈ పొలంపనులు ఇంట్లో చాకిరి -అది ఒక్కతే చెయ్యలేదు." తలగోక్కుంటూ అన్నాడు భూమన్న.

"నీకేం భయంరా ! అంతా మంచిగ జరుగుతుంది."

భూమన్న కాళ్ళీడ్చుకుంటు లోపలికి వెళ్ళాడు. అప్పటికే తన గదిలో వెంకన్న మంగమ్మ పిల్లలతో చాపలు పరుచుకు పడుకున్నారు.

తనెక్కడ పడుకోవాలి? సుబ్బును జాగ్రత్తగా చూసుకొమ్మంది డాక్టరమ్మ. వెంటనే తల్లినడిగాడు. తల్లి ఏదో చెప్పబోతుండగా వెంకన్న వచ్చి "చేసిన నిర్వాకం చాలు. ముసలి వాళ్ళను మోసగించి డబ్బు చేరవేస్తున్నావు. నడుఇంట్లో నుంచి. మీ ముఖాలు నాకు కనబడితే ఏంచేస్తానో ?" రంకెలుపెట్టాడు.

భూమన్న నిర్విణ్ణుడయ్యాడు. చిన్నప్పటినుంచీ ఇంతే. తను అన్నంతింటే ఓర్చేవాడు కాదు. తనను చావగొట్టి ఇంట్లోనుంచి బయటికి తోసేవాడు. ఇంకా అట్లాగే ఉంది పీడిబుద్ధి అనుకున్నాడు.

ఆ మరునాడు వాళ్ళిద్దరు పొలానికి పోలేదు. పక్క జాగాలో ఇల్లు కట్టుకోవాలని రాయీ రప్పా ఏరుతున్నారిద్దరు.

ఎక్కడి నుంచో ఊడిపడ్డాడు వెంకన్న. "ఇక్కడ ఇల్లు కడదామనుకుంటున్నావా ? నీకిక్కడ గడ్డిపరకయినా లేదు పోపో" భూమన్న చేతిలో నుంచి పార లాక్కుని ఒక్క తోపు తోశాడు.

భూమన్న వెల్లకిలా బడ్డాడు. తలకు దెబ్బతగిలింది.

సుబ్బు వచ్చి భూమన్నను లేపి కూర్చోబెట్టింది. లోపలినుంచి పసుపుతెచ్చి గాయానికి అద్దింది. ఇది చూసిన తల్లి ఒక్కపరుగున వచ్చి భూమన్నను వాటేసుకుని ఏడ్చింది.

భూమన్నను లోపలికి తీసుకుపోదామని ప్రయత్నించింది రాములమ్మ, వెంకన్న ఉగ్రుడై చేతులడ్డంపెట్టాడు.

మధ్యాహ్నం కావచ్చింది. ఇద్దరికీ భోజనాలు లేవు. కడుపులో ఆకలి.

సుబ్బు మెల్లగా భూమన్నను లేపి ''మనం ఇక్కడి నుంచి వెళ్ళిపోదాం.

ఇక్కడుండొద్దు, ప్రాణాలు దక్కవుపద" భూమన్నను నడిపించుకుంటూ వెళ్ళింది. వెనకనుంచి రాములమ్మ నరశురామయ్య కేకలు వినుపిస్తున్నాయి.

మిట్టమధ్యాహ్నం వేళ, కట్టుబట్టలతో కడుపుతో ఉన్న సుబ్బును ఆసరా చేసుకుని ఊరిబయటికి నడిచాడు భూమన్న. ఒక చెట్టుకింద అతడిని కూర్చోబెట్టి చెంగుకు ముడివేసుకున్న దానిలోనుంచి రెండురూపాయలు తీసి అరటి పళ్ళు తీసుకువచ్చింది. ఇద్దరూ కలిసి తిని ఆ చెట్టుకింద విశ్రాంతి తీసుకుని రాత్రికల్లా పక్క ఊరికి చేరారు.

భూమన్నకు ఒకటే ఆలోచన. అమ్మకూ నాయనకూ ఇంక తిండీ గుడ్డా ఉండవు. తనకు రెక్కలిచ్చాడుదేవుడు. ఎక్కడయినాపాలేరుగా కుదిరినా ఇద్దరికీ తిండి గడిచిపోతుంది. ఆ భూమే, ఆ ఇల్లే కావాలని లేదు. నాకు మాలక్ష్మిలాంటి సుబ్బు ఉంది. తను ఇద్దరుపిల్లలకు తండ్రి కాబోతున్నాడు. కష్టపడితే తిండి పుడుతుంది, అనుకున్నాడు.